క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్ అనిత

సాక్షి ఎఫెక్ట్

తంగళ్లపల్లి: మండల కేంద్రంతోపాటు ప్రధాన రహదారి పొడవునా స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని 'ఆ రహదారి.. ప్రమాదకరం' శీర్షికతో ఈ నెల 11న ప్రచురించిన 'సాక్షి' కథనానికి సర్పంచ్ అంకారపు అనిత స్పందించారు. మూలమలుపు వద్ద ఎత్తుగా ఉండి ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతంలో తారుపోయించి వాహనాలు సులువుగా వెళ్లేలా మరమ్మతు చేయించారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించి పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి మండల ప్రజలు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

కుట్టుమిషన్ అందజేత



కుట్టుమిషన్ అందజేస్తున్న అంజన్‌రావు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన నిరుపేద యువతి శివరాత్రి అఖిలకు చిట్నేని వెంకటేశ్వర్‌రావు, మాధవి దంపతులు రూ.12 వేల విలువైన కుట్టు మిషన్‌ను బుధవారం అందజేశారు. అలాగే కారోబార్ ఎడబోయిన విజయ్ కూతురు వివాహానికి, బందనకల్‌లో ఎనగందుల దుర్గయ్య, పద్మ, కొమ్మాట శ్రీనివాస్, లక్ష్మి పుస్తె మెట్టెలు, చీర, గాజులు అందించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్నేని అంజన్ రావు, మాజీ ఎంపీటీసీ చిట్నేని శ్రీనివాస్‌రావు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, చిగురు నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ జనగామ శరత్ రావు బుధవారం ప్రారంభించారు. అనంతరం కొండాపూర్‌లో ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. సర్పంచ్ యారపు లక్ష్మి, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్ రావు, ఉపసర్పంచ్ బషీర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు పాల్గొన్నారు.

'ఉపాధి'కి దూరంగా..

- విలీన గ్రామాల కూలీలకు అందని ఉపాధి
- ఇబ్బంది పడుతున్న నిరుపేదలు
- పథకం అమలు చేయాలని వేడుకోలు

విలీన గ్రామాల్లో గతంలో జాబ్ కార్డుల వివరాలు

గ్రామం	కార్డులు
రగుడు	355
చంద్రంపేట	498
చిన్నబోనాల	423
పెద్దబోనాల	453
ముష్టిపల్లి	583
పెద్దూరు	667
సర్దాపూర్	273



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపాలిటీలో సమీప గ్రామాలను విలీనం చేయడంతో ఆయా గ్రామాల్లోని కూలీలు ఉపాధి హామీ పథకానికి దూరమయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కేవలం గ్రామాలకే పరిమితమయ్యేది. అప్పుడు ప్రతి కుటుంబంలో జాబ్‌కార్డులు కలిగి ఉపాధి పొందేవారు. వంద రోజుల పాటు కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు వ్యవసాయం పనులకు వెళ్లి ఎంతో కొంత సంపాదించుకునేవారు. ప్రస్తుతం ఐదేళ్ల నుంచి ఎలాంటి ఉపాధి హామీ పనులు లేక నిరుపేద కూలీలు జీవనోపాధి కొరకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. భూముల ఉన్న వారు వ్యవసాయం సాగు చేసుకుంటుండగా, ఎలాంటి ఆధారం లేని నిరుపేద కూలీలు పనులకు వలస వెళ్తున్నారు. పట్టణంలో కలిస్తే ఉపాధికి బాటలు పడుతాయనుకుంటే ఉన్న పనికి దూరం చేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

విలీనమే శాపంగా మారింది

సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన ఒక్కో గ్రామంలో వందల కొలది ఉపాధి పనులు చేసుకుంటూ, వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. మొత్తం ఏడు గ్రామాల్లో దాదాపు 3,252 మందికి జాబ్‌కార్డులు ఉండేవి. వీరందరూ వంద రోజుల పాటు ఉపాధి పనులు చేసేవారు. పనులు లేనప్పుడు వ్యవసాయ పనులకు వెళ్లేవారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులథకింద హరితహారం, డంపింగ్ యార్డు, చెరువు పూడికతీత, ఒండ్రుమట్టి తరలింపు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, నర్సరీ పనులను నిర్వహించేవారు. దీంతో ఉపాధి కూలీల జీవితాల్లో మార్పు కనిపించింది. ప్రస్తుతం మున్సిపల్‌లో కలవడంతో ఎలాంటి పనులు లేకుండా పోయింది. దీంతో వ్యవసాయ పొలాల్లో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ పనులు లేనప్పుడు భవన నిర్మాణ, హమాలీ పనులకు వెళ్తూ కాలం వెల్లదీస్తున్నారు. విలీనగ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి పనులు కల్పించాలని వేడుకుంటున్నారు.

ఉపాధి పని కల్పించాలి



ఐదేళ్ల క్రితం మా గ్రామాలన్నీ సిరిసిల్లలో విలీనం చేశారు. అప్పటి నుంచి ఉపాధి పని బంద్ చేశారు. వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్తున్నారు. అధికారులు స్పందించి విలీన గ్రామాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– సూర దేవరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

వంద రోజులు పని దొరికేది



గ్రామపంచాయతీగా ఉన్నపుడు వ్యవసాయ పనులు లేని సమయంలో ఎండకాలంలో దాదాపు 100 రోజుల పని దొరికేది. రోజు రూ.150 వరకు సంపాదించేవాళ్లం. ప్రస్తుతం మా గ్రామాలను మున్సిపాలిటీలో కల్పడంతో ఉపాధికి దూరమయ్యాం. పనులు లేక కూలీకి పోతున్నాం.

– ఎలుక తిరుపతి, రగుడు

గ్రామాలకే పరిమితం



కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉపాధి హామీ పథకం వర్తిస్తుంది. పట్టణ ప్రాంతాలకు వర్తించదు. సిరిసిల్ల మున్సిపల్‌లో ఏడు గ్రామాలను విలీనం చేయడంతో ఉపాధి హామీ పథకాన్ని కోల్పోయారు.

– మదన్‌మోహన్, డీఆర్‌డీవో

కెనాల్ నిర్మాణానికి తొలగిన అడ్డంకి



రైతులతో చర్చిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

ముస్తాబాద్: మండలంలోని బందనకల్, మొర్రాపూర్ తండా వరకు నిర్మించే మల్లన్నసాగర్ కెనాల్ నిర్మాణానికి స్థల సేకరణ సమస్యగా మారగా ఎంపీపీ జనగామ శరత్‌రావు చొరవ తీసుకుని రైతులతో బుధవారం మాట్లాడారు. సిద్దిపేట జిల్లా మాచాపూర్, చింతమడకకు చెందిన రైతుల పొలాల నుంచి మల్లన్నసాగర్ లైన్ వస్తుండగా ప్రస్తుతం జోరుగా పనులు నడుస్తున్నాయని ఎంపీపీ తెలిపారు. బందనకల్ శివారులో ఉన్న భూములను ఇద్దరు రైతులు కెనాల్ నిర్మించేందుకు నిరాకరించారన్నారు. వారితో చర్చించి భూ పరిహారంతోపాటు ప్రభుత్వం నుంచి ఆదుకునేలా హామీ ఇచ్చామన్నారు. ఈమేరకు సదరు రైతులు ఒప్పుకోవడంతో కెనాల్ నిర్మాణం ప్రారంభించామన్నారు. అలాగే రంగనాయకసాగర్ నుంచి మాచాపూర్ వరకు వస్తున్న కెనాల్ నీటిని వెంకట్రావుపల్లె పులికుంట వరకు వదిలేలా డీఈతో మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడంతో పొలాలు ఎండుతున్నాయని, కెనాల్ నీటిని పులికుంటకు తరలిస్తే రెండు గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సర్పంచులు లక్ష్మణ్, కిషన్‌రావు, రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, రవీందర్‌రావు ఉన్నారు.


కాన్షీరామ్‌కు నివాళి



తంగళ్లపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి/గంభీరావుపేట: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం 89వ జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. తంగళ్లపల్లి మండల కేంద్రం తాడూర్ చౌరస్తా, గంభీరావుపేటలో బుధవారం బీఎస్‌పీ మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్ కార్యక్రమంలో బీఎస్‌పీ మండల ఉపాధ్యక్షుడు మునిగె భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డుపై కంకర కుప్పలు - వాహనదారులకు తిప్పలు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై ప్రయాణమంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్లే హైవేపై కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల కంకర కుప్పలను పక్షం రోజులుగా పోసి వదిలేశారు. దీంతో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. రాత్రి వేళ హైవేలో ప్రయాణించాలంటేనే వణికిపోతున్నారు. గడిచిన వారం రోజుల్లో పాతికమంది వరకు వాహనదారులు ప్రమాదాలకు గురై తీవ్రగాయాలపాలయ్యారు. మరిన్ని ప్రమాదాల జరుగక ముందే అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

మీరు ప్రశ్నించాల్సిన అధికారి: శ్యాంసుందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ
ఫోన్ నంబరు: 94408 18154

వాతావరణ ఆధారిత వ్యవసాయంతో లాభాలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

బోయినపల్లి: వాతావరణ ఆధారిత వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అన్నారు. మండలంలోని కోరెం గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవం పథకంలో భాగంగా కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో గ్రామంలో విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు. బుధవారం సాగురంగంలో సాంకేతిక పరిజ్ఞానంపై గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ ఆధారిత పంటలతో సాగులో ఖర్చులు తగ్గించవచ్చని తెలిపారు. అలాగే గ్రామంలో వ్యవసాయ సమాచార కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు వాతావరణ ఆధారిత సాగు విధానంలో మెళకువలు చెబుతున్నట్లు వివరించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రేష్మ, శ్రీయ, వినీల రైతు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



కంటివెలుగు ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీవాణి

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరి శ్రీవాణి, ఎంపీటీసీ సిలివేరి ప్రసూన, ఉప సర్పంచ్ సాయిరాం, సింగిల్ విండో వైస్‌చైర్మన్ రమణారెడ్డి, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు బైరి రమేశ్, జాగృతి అధ్యక్షుడు రామాగౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భూక్య తండా గ్రామంలో

వీర్నపల్లి: మండలంలోని భూక్య తండా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గుగులోత్ భారతి బుధవారం ప్రారంభించారు. సెస్ డైరక్టర్ మాడుగుల మల్లేశం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షులు కళ, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గుగులోత్ శ్రీరామ్ నాయక్, ఉపసర్పంచ్ రామావత్ తిరుపతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



రుద్రంగి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు నృత్యాలతో అలరించారు. సర్పంచ్ తర్రె ప్రభలత, హెచ్ఎం అంబటి శంకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ఎస్సై మామిడి మహేందర్ ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పే అపరిచిత వ్యక్తుల ఫోన్లకు స్పందించొద్దన్నారు. ప్రజలు తమ యొక్క వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి చెప్పొద్దన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు, ఇతర వివరాలు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని 25వ వార్డుకు చెందిన అడ్డగట్ల సాగర్‌కి రూ.26,500, గోలి మధు రూ.42,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కౌన్సిలర్ కుడిక్యాల రవికుమార్ అందజేశారు. వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఎల్లారెడ్డిపేట: ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్షకు అవసరపడిన పెన్నులు, ఇతర సామగ్రిని బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షులు ఆకుల మురళి గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సందీప్ ,సీత్యానాయక్, సద్దాం, ఉదయ్, చందనం శివరామకృష్ణ పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలంగా కళామందిర్



ప్రాంగణంలో పార్కింగ్ చేసిన వాహనాలు

వేములవాడరూరల్: పురిటి గడ్డపై అభిమానంతో కళాకారుల కోసం వేములవాడ మండలంలోని హన్మాజిపేట గ్రామానికి చెందిన డాక్టర్ సి.నారాయణరెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కాలంలో వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో కళామందిర్ పేరుతో రెండు భవనాలు నిర్మించారు. మండల పరిషత్ ఆవరణలో ఏప్రిల్ 10, 2002లో రూ.50 లక్షలతో నిర్మించిన ఈం కళామందిర్ మున్సిపల్ వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. రోజురోజుకు శిథిలావస్థకు చేరుకున్న ఈ భవన నూతన నిర్మాణం కోసం రూ.8 కోట్లను ఎమ్మెల్యే రమేశ్‌బాబు మంజూరు చేశారు. కానీ నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో మున్సిపల్ శాఖ అధికారులు కళామందిర్ ఆవరణను చెత్తబండ్ల పార్కింగ్‌గా మార్చుకున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



గంభీరావుపేట: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు



రుద్రంగి: తనిఖీ చేస్తున్న తహసీల్దార్ భాస్కర్

గంభీరావుపేట: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్లు సరిచూసుకొని పరీక్ష కేంద్రంలోకి అడుగు పెట్టారు. అధ్యాపకులు విద్యార్థులను తనిఖీ చేశారు. దూర ప్రాంతాల విద్యార్థులు బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో బుధవారం ప్రథమ సంవత్సరం పరీక్షకు 293 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 280 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాచర్ల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే తరగతి గదులకు అనుమతించారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

రుద్రంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షలు నిర్వహించాలని, పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు.

సావిత్రిబాయి పూలే విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి పాఠశాలలో సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. సామాజిక కార్యకర్త అందె సామేల్ విగ్రహాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు జబ్బర్, ఉపసర్పంచ్ పెంజర్ల దేవయ్య పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ మేయింటనెన్స్ పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నియామకం

రైతు చర్చ మండలి అధ్యక్షుడిగా రాజిరెడ్డి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట రైతు చర్చ మండలి అధ్యక్షుడిగా సందుపట్ల రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చర్చ మండలి సభ్యులు బుధవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సద్ది నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యమగోండ కృష్ణారెడ్డి, కోశాధికారిగా వంగ శ్రీకాంత్‌రెడ్డి, రైటర్‌గా రాగుల ఎల్లారెడ్డి, ప్రధాన సలహాదారులుగా మద్దుల మల్లారెడ్డితో పాటు 12 మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

పరీక్షల వేళలకు అనుగుణంగా బస్సులు నడపాలి



డీఎం మనోహర్‌కు వినతిపత్రం ఇస్తున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. బుధవారం సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్‌కు వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు నడుస్తున్నందున విద్యార్థులు పరీక్షలకు సమయానికి హాజరయ్యేందుకు గాను జిల్లా కేంద్రం సిరిసిల్లకు వచ్చే అన్ని రూట్లలో బస్సులు నడపాలన్నారు. నాయకులు నవీన్, రాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కరుణ

గంభీరావుపేట: స్వచ్ఛభారత్ మిషన్ రెండో విడత కార్యక్రమాలను శిక్షణ పొందిన అధికారులు విజయవంతం చేయాలని ఎంపీపీ వంగ కరుణ అన్నారు. ఎస్‌బీఎం-2 అధికారుల మూడు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. స్వచ్ఛభారత్‌లో ఏయే కార్యక్రమాలు నిర్వహించాలో మండల స్థాయి అధికారులు శిక్షణ పొందారు. ఒకరోజు క్షేత్ర స్థాయిలో సందర్శనకు వెళ్లారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకంపై ప్రజలను చైతన్యపరిచే విధంగా అధికారులు శిక్షణ పొందారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం

సిరిసిల్లటౌన్: ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం వహిస్తోందని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు బూర సదానందం విమర్శించారు. బుధవారం సిరిసిల్లలో జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై కనీసం అఫిడవిట్ దాఖలు చేయకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనంగా పేర్కొన్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌కు ఆత్మీయ సన్మానం జరిపి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల్లో ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అవురం సుధాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.